క్లుప్తంగా

విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్

నందిగామటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించటంతోపాటు ట్రూ అప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10గంటలకు విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేట అర్బన్: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యుత్ ఏడీ కార్యాలయంలో వినతిపత్రం అందజేయనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ సోమవారం తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఉన్న విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయంలో వినతిపత్రం అందజేయనున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వైభవంగా పడిపూజ



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం వద్ద ఆదివారం రాత్రి నరసింహస్వామి వారి పడిపూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. దీక్షా స్వాముల ఆధ్వర్యంలో పడిపూజ, నిప్పుల గుండం కార్యక్రమాలను నిర్వహించారు. మూడు గంటల పాటు జరిగిన పడిపూజా కార్యక్రమంతో గ్రామం నరసింహస్వామి నామస్మరణ మార్మోగింది. పెద్దసంఖ్యలో భక్తులు, మాలధారులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాలు అందజేత



పెనుగంచిప్రోలు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదోతరగతి పరీక్షల్లో ప్రతిభచూపిన ఇద్దరు ఎస్సీ విద్యార్థులకు కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుడేటి జీవన్‌కుమార్ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. తనతల్లి కమలమ్మ జ్ఞాపకార్థం నగదు బహుమతిని ఎంఈఓ డి.రవీంద్ర చేతుల మీదుగా అందజేశారు. 600 మార్కులకుగాను 549 మార్కులు సాధించిన కొల్లికుళ్ల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గొర్రెపాటి నేహకు రూ.10వేలు, 532 మార్కులు సాధించిన పెనుగంచిప్రోలు కెవీఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని మిట్టబాల రక్షితకు రూ.5 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్‌కుమార్, పి.సునీల్, ఉపాధ్యాయులు, జీవన్‌కుమార్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చిట్టేల(వత్సవాయి): చిట్టేల గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా జరగనున్న కార్యక్రమాల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.వేదపండితులు సిరికొండ సాయికృష్ణమాచార్యులు, ప్రసాద్‌శర్మ మంత్రోచ్చరణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పుణ్యావహచాన, అఖండ దీపారాధనతో కార్యక్రమాలను ప్రారంభించారు. గోపూజ చేశారు. ఆలయ నిర్మాణధర్మకర్త మారెళ్ళ పుల్లారెడ్డి, భక్తులకు కంకణధారణ చేసిన అనంతరం అర్చకులు శ్రీ వెంకటేశ్వరుని పెళ్లి కుమారుడిని చేశారు. బ్రహ్మోత్సవాలకు మండంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు మారెళ్ళ నారాయణ రెడ్డి, సురారెడ్డి, కుటుంబరెడ్డి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బైక్ ఢీ కొని వ్యక్తికి గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గొల్లపూడి అయ్యప్ప గుడి సమీపంలో నివాసం ఉంటున్న కె.శ్రీను వాసవీ ఫార్మాలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మంచినీరు తెచ్చుకుందామని ద్విచక్రవాహనంపై బయలుదేరి గొల్లపూడి వన్ సెంటర్‌కు వస్తుండగా వన్‌వేలో ఎదురుగా వచ్చిన బైక్ వేగంగా బండిని ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీను తలకు, ఎడమ మోకాలికి గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

తన్నీరు నాగేశ్వరరావు



మైసమ్మ గండి వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తంచేస్తున్న తన్నీరు, శివాజీ, గాంధీ, రైతులు, నాయకులు

పెనుగంచిప్రోలు/వత్సవాయి : రైతులను కూటమి ప్రభుత్వం దారుణంగా దగా చేస్తోందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు మండిపడ్డారు. గతేడాది సంభవించిన వరదలకు పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని తువ్వకాలువకు పడిన గండ్లను రైతులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. మైసమ్మ గండి వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ మునేరుకు గతేడాది సెప్టెంబర్ నెలలో భారీ వరదలు రావడంతో తువ్వకాలువకు 50 చోట్లకు గండ్లు పడగా, వాటిని పూడ్చివేత పనులను కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు దృష్టి పెట్టకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గండ్లు పూడ్చివేత పనుల కోసం రూ.1.60కోట్లతో అంచనాలు రూపొందించామని అధికారులు చెబుతుండగా, సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. వరదలకు ఖరీఫ్ నష్టపోవడంతోపాటు ఈఏడాది రబీ కూడా రైతులు నష్టపోయారన్నారు. వరదలకు పంట నష్టంతోపాటు భూములు కోతకు గురై ఇసుక మేట మేసిందన్నారు. తువ్వకాలువ గండ్లు పూడ్చకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సాగు కూడా కష్టమేనన్నారు. వర్షాలు పడితే వరద నీరు మరలా పొలాలపై ప్రవహించి రైతులు దారుణంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.

గిట్టుబాటు ధరలు లేక రైతులు విలవిల..

వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నా, కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని తన్నీరు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తువ్వకాలువకు గండ్లు పడితే వెంటనే పూడ్చించి రైతులను ఆదుకున్న వైనాన్ని గుర్తుచేశారు. ఇసుక మేట వేసిన పొలాలకు ఎకరానికి రూ.50వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. పొలాల్లో ఇసుక మేటను తొలగింపునకు రైతులకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ స్పందించి రైతుల కష్టాలను గమనించి తువ్వకాలువ గండ్లు పూడ్చే పనులపై వెంటనే దృష్టి పెట్టాలని కోరారు. ఈ నెలాఖరులోపు తవ్వకాలువ గండ్లు పూడ్చకపోతే రైతులతో కలసి తహసీల్దార్, ఇరిగేషన్ కార్యాలయాల వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ఇసుక, మట్టి రవాణాపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. వరి, పత్తి, మిర్చితోపాటు ఆయా పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నప్పటికీ పాలకులకు పట్టకపోవడం శోచనీయమని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల పార్టీ అధ్యక్షులు పాన్నం కోటేశ్వరరావు, గుత్తా శంకరరావు, జిల్లా కార్యదర్శి చల్లా వైకుంఠరావు, నియోజకవర్గ యువజన విభాగం, వాణిజ్య విభాగం అధ్యక్షులు నర్రమనేని వెంకటేష్, దేరంగుల శ్రీనివాసరావు, వత్సవాయి రైతు విభాగం మండల అధ్యక్షులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, శ్రీకనదుర్గమ్మవారి ఆలయ మాజీ డైరెక్టర్ నంబూరి రవి, సుబ్బాయిగూడెం, ఆళ్లూరుపాడు సర్పంచ్‌లు పాపినేని వెంకటేశ్వరరావు, యలమర్తి నరేంద్ర జగ్గయ్యపేట పట్టణ యూత్ అధ్యక్షుడు గొట్టిపాళ్ల సురేష్, సొసైటీ మాజీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, నాయకులు యానాల సురేష్, లగడపాటి జనార్దన్, కాకాని హరి, ముసిబోయిన సైదులు, గుడిమెట్ల శంకర్, కోలా రామారావు, మల్లెంపాటి సతీష్, తవ్వకాలువ పరిధిలోని సాగుభూముల రైతులు పాల్గొన్నారు.



అనిగండ్లపాడు వద్ద తువ్వకాలువ గండి పరిశీలిస్తున్న తన్నీరు, ఎంపీపీ గాంధీ, శివాజీ తదితరులు

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 11అర్జీలు

నందిగామ రూరల్: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ కె.బాలకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూశాఖకు సంబంధించి ఆరు అర్జీలు, పంచాయతీరాజ్ శాఖకు రెండు, గృహ నిర్మాణ ఒకటి, పౌర సరఫరాల శాఖకు ఒక అర్జీ కలిపి మొత్తం పది అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అర్జీలను ఆయాశాఖలకు పంపి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఆర్డీఓ వివరించారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కంచికచర్లలో రోడ్డుపై మురుగునీరు పారుదల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఓ అర్జీ అందినట్లు ఎంపీడీఓ తెలిపారు. అర్జీని త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యానికి గురై ఆర్థిక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. తన నివాసంలో సోమవారం ఆయన నలుగురు లబ్ధిదారులకు కలిపి మంజూరైన మొత్తం రూ.1.14లక్షల విలువగల నాలుగు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు దర్శి విజయనరసింహారావు, మైల రమణారెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, పటాపంచుల తిరపారావు, గుమ్మ మధు, గుడారు నాగార్జున, కరిసె సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ పేరుతో మోసం తగదు : బత్తుల

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో బీసీ మహిళలకు కుట్టు శిక్షణ పథకం పేరుతో రూ.257కోట్లకు గాను రూ.154 కోట్లు భారీ స్కాంనకు కూటమి ప్రభుత్వం తెరలేపిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు విమర్శించారు. పెనుగంచిప్రోలులో సోమవారం ఆయన బీసీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు.

బీసీలకు అందాల్సిన కుట్టు మిషన్లను ఆసరా చేసుకుని వందల కోట్లు దండు కోవటానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కుట్టుశిక్షణ, మిషన్ అందజేతకు రూ.7300 ఖర్చవుతుండగా, కూటమి పెద్దలు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై అందుకు రెండురెట్లు సొమ్మును స్వాహా చేస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు పథకాల పేరుతో భారీ స్కాంకు పాల్పడుతూ బీసీలను కూటమి ప్రభుత్వం ఘోరంగా మోసం చేస్తోందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, పూసల కార్పొరేషన్ మాజీ డైరక్టర్ చేని కుమారి, బీసీ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, గుడిమెట్ల శంకర్, చేని రాంబాబు, ముసిబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్తుల రామారావు, బీసీ నాయకులు

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

వీరులపాడు: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హుస్సేన్ హెచ్చరించారు. మండలంలోని తాటిగుమ్మి గ్రామంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ఆయన స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావటంతో దాడి చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రూ. ఐదు వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు

నారసింహుడి తిరుకల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

వేదాద్రి(జగ్గయ్యపేట): వేదాద్రి గ్రామంలో వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆయా వివరాలను ఈఓ కానూరి సురేష్‌బాబు తెలిపారు.

ఉత్సవాల వివరాలు..

ఈనెల ఏడోతేదీన స్వామివారిని పెండ్లి కుమారుని చేయుట, 8న అంకురార్పణ, ధ్వజారోహణ, 9న స్వామివారి శేషవాహన సేవ, 10న హనుమంత సేవ, 11న బంగారు ఆభరణాల అలంకరణంలో స్వామి వారి దర్శనం, దీక్షా స్వాముల ఇరుముడి సమర్పణ, స్వామివారి ఎదురుకోలోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు స్వామి వారి తిరుక్కళ్యాణ మహోత్సవం, 12న గజవాహన సేవ, తెప్పోత్సవం , 13న చూర్ణోత్సవం, చక్రతీర్థం, వసంతోత్సవం, పూర్ణాహుతి, 14న పవళింపు సేవ, 12 సేవలు, ఆరగింపులు, పుష్పయాగం తదితర సేవలతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

ఘాట్ రోడ్డు నిర్మాణం..

ఆలయంలోని స్వయంభు జ్వాలా నరసింహస్వామి వారి సన్నిధానానికి భక్తుల సహాయంతో ఈ ఏడాది ప్రత్యేక ఘాట్ రోడ్డు నిర్మాణం చేశారు. ఘాట్ రోడ్డు నిర్మాణం లేకపోవడంతో కొండపైకి భక్తులు నడకదారిన వెళ్లేవారు. హైదరాబాద్‌కు చెందిన దాత ఘాట్‌రోడ్డు నిర్మించడంతో వాహనాలు కూడా పైకి వెళ్లే వీలుంది.

ఉత్సవాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు..

కల్యాణ మహోత్సవాల సందర్భంగా నందిగామ, జగ్గయ్యపేట నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నుంచి గింజుపల్లి వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారిలో కొణకంచి అడ్డరోడ్డు నుంచి బండిపాలెం మీదుగా, చిల్లకల్లు నుంచి వేదాద్రిలోని స్వామివారి ఆలయానికి చేరుకోవచ్చు.



యోగానంద లక్ష్మీనరసింహస్వామి



కొండపైకి వెళ్లేందుకు నిర్మించిన ఘాట్ రోడ్డు

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కనున్న మున్సిపల్‌పార్కులో ఆదివారం సదరు పార్కు వాచ్‌మెన్ పార్కుకు వచ్చిన సందర్శకులతో దురుసుగా ప్రవర్తించారంటూ పలువురు సందర్శకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావుకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..వేసవి కాలం కావడంతో పార్కులో సేదతీరేందుకు మున్సిపల్ పార్కుకు వచ్చిన సందర్శకులు ఆదివారం సాయంత్రం పార్కు మూసివేసే సమయానికి బయటకు వెళ్లేందుకు బస్టాండ్ వైపు ఉన్న ద్వారం వద్దకు వచ్చారు. కాగా అప్పటికే మద్యం సేవించి ఉన్న వాచ్‌మెన్ కొండ పార్కు గేటు మూసివేశాడు. గేటు తీయాలని వారు కోరినప్పటికీ తీసేది లేదని మొండి కేశాడు. నా ఇష్టం అంటూ అక్కడున్న వారితో ఇష్టానుసారంగా మాట్లాడాడు. దీంతో చేసేది లేక కొంతసేపటి తరువాత తూర్పు వైపు ఉన్న గేటు తాళం వేరే వారితో తీయించి బయటకు వెళ్లారు. బాధితులు విషయాన్ని కమిషనర్‌కు తెలియజేయగా, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటానని ఆయన వివరించారు.

వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



వాద్యకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: గాయనీ గాయకులతో పాటు వారి ఉన్నతికి సహాయ సహకారాలు అందిస్తున్న వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై సోమవారం రైల్వే అధికారి, కళాపోషకుడు మారేపల్లి జోషి జన్మదిన సందర్భంగా సినీ సంగీత విభావరి, వాయిద్య కళాకారులు ఉండ్రు చిట్టిబాబు, ఇశ్రాయల్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ సాహితీ సాంస్కృతిక సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. సత్కార కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, బీవీ వీరభద్రరావు, జయప్రభు, ప్రసూనా రామన్ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. వాయిద్య కళాకారులు చిట్టిబాబు, ఇశ్రాయల్‌ను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన



చిల్లకల్లులో ప్రజలకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రపంచ చేతులు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చిల్లకల్లులో ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. వైద్యారోగ్య సిబ్బంది ఆహారం తినటానికి ముందు, తిన్న తరువాత, కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది రాధిక, రమేష్, ఏఎన్ఎంలు, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

నందిగామరూరల్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన మూడు డీఏలను, 11వ పీఆర్సీకి సంబంధించి బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి కమిటీ నివేదిక వచ్చేలోగా ఇంటీరియల్ రిలీఫ్ విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న తొమ్మిది రకాల పాఠశాలలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో కె.బాలకృష్ణ, తహసీల్దార్ సురేష్‌బాబులను కలసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు చెట్టిపోగు రాము, సాతుపాటి నరసయ్య, షేక్ ఖాజా, మండాది వెంకటేశ్వర్లు, అబ్దుల్ రవూఫ్, నరసింహారావు, యలమందయ్య, వేణు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి..

కంచికచర్ల: రాష్ట్రప్రభుత్వ నిర్ణయాలు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అనిత, జిల్లా కార్యదర్శి ఏ.సుందరరామారావు విమర్శించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా తగ్గిపోతోందన్నారు. గతేడాది కంటే ఈసారి జీరో నమోదు పాఠశాలల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దుచేయాలని, మెమో నంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి వెంటనే ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలతోపాటు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ మానసకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు వి ప్రభుకిషోర్, ఏఎస్ఆర్ మూర్తి, టి.శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న టీచర్లు, ఏపీటీఎఫ్ నాయకులు



కంచికచర్లలో ఇన్‌చార్జి తహసీల్దార్ మానసకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

షహనాజ్ బేగంకు నాయకుల అభినందన

వీరులపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం తెలిపారు. ఆపార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన షహనాజ్ బేగంను మండలానికి చెందిన పలువురు నాయకులు జుజ్జూరులోని ఆమె నివాసంలో సోమవారం కలిసి అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎంపీపీ కోటేరు లక్ష్మి, మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. షహనాజ్‌బేగంకు అభినందనలు తెలిపిన వారిలో నాయకులు షేక్ సైదా, షేక్ మోమిన్, ఆకుల అంజయ్య, లక్ష్మీనారాయణ, షేక్ ఖాజా సాహెబ్, ఖాజాపీర్, షేక్ జానీవలి తదితరులు ఉన్నారు.



షహనాజ్ బేగంను అభినందిస్తున్న నాయకులు

విద్యార్థులకు యోగా శిక్షణ



పేటలో యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులతో రామచంద్రుడు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎ.ప్రభ సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. కథలు చెప్పించారు. అనంతరం యోగా టీచర్ ఎస్.లీలావతి యోగాపై అవగాహన కల్పించారు. యోగాసనాలు వేయించారు. ఉపాధ్యాయుడు పర్వా లక్ష్మణరావు యాక్షన్ సాంగ్స్, జాతీయ గీతాలు నేర్పించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు ఆధ్వర్యంలో విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులు కథలు చదివి వినిపించారు. విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో యర్రం భాస్కరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయాప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రసాద్, వెంకటేష్, వీరాంజనేయులు, నాగేంద్రబాబు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.